## క్లుప్తంగా

### సప్పా ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం



పురస్కారాన్ని అందిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

సీటీఆర్ఐ: విశిష్ట ప్రతిభావంతులకు సప్పా ఎక్స్‌లెన్స్ పురస్కారాలను అందించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. నటరాజ నృత్య నికేతన్ 40 వసంతాల వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజైన ఆదివారం 27 మంది ప్రముఖులకు సప్పా ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆలయ నృత్యానికి దేశవ్యాప్తంగా పేరు తెచ్చిన సంస్థ వ్యవస్థాపకుడైన నాట్యాచారుడు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా శాసన సభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, ప్రముఖ వస్త్ర వ్యాపారి తుమ్మిడి రామ్‌కుమార్, ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



వెంకాయమ్మపేటలో జరిగిన పడిపూజలో పాల్గొన్న మాలధారులు

కడియం: మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దాసరి శ్రీను ఆధ్వర్యంలో మండలంలోని వెంకాయమ్మపేటలో అయ్యప్ప స్వామి పడిపూజా మహోత్సవం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి మొదలైన ఈ కార్యక్రమం ఆదివారం పొద్దుపోయే వరకూ కొనసాగింది. తాడాల వీరవెంకట్రావు గురుస్వామి పర్యవేక్షణలో గణపతి హోమం, పేటతుళ్లి చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామిని ఉంచి, కేరళ తాంత్రిక విధానం పూజలు జరిపారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు సందర్శించారు. పెద్దఎత్తున నర్సరీ రైతులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం



బుర్రిలంకలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడియం: చిరు సేవా సమితి అధ్యక్షుడు గెద్దం శివ ఆధ్వర్యంలో బుర్రిలంక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అభిరామ్ హాస్పిటల్ డయాబెటిక్ ఎండోక్రైన్‌స్కిన్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డా.ఎంవీ శేఖర్‌రెడ్డి, బృందం 135 మందికి వైద్య పరీక్షలు చేశారు. కిడ్నీ, థైరాయిడ్ సమస్యలు గుర్తించిన వారికి, ఆస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో కడియపులంక ఇన్‌ఛార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నాయకులు మార్గాని సత్యనారాయణ, గట్టి నరసయ్య, పాటంశెట్టి సుబ్బారావు, చిరుసేవా సమితి, మైత్రి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో రాజమహేంద్రవరంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కంబాలచెరువు సెంటర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పించి సంబరాలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కేసీఆర్ పాలనతో విసిగిపోయిన ప్రజలు.. తమకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విభజన చట్టంలోని అన్ని హామీలను నేరవేర్చే బాధ్యతలను తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ముళ్ల మాధవ్, చింతాడ వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బత్తిన చంద్రరావు, చామర్తి లీలావతి, ఇజ్జరౌతు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాంతి లోకం

- ఆధునిక వెలుగులతో గ్లో గార్డెన్ నిర్మాణం
- రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు
- నగరంలో ఆవిష్కృతం కానున్న మరో అద్భుతం





గ్లో గార్డెన్ (ఊహా చిత్రం)



గ్లో గార్డెన్ లోపలి భాగం (ఊహా చిత్రం)

రాజమహేంద్రవరం సిటీ: విరజిమ్మే కాంతులు.. వేసే ప్రతి అడుగూ కాంతిబాటలోనే.. చెట్లు, జంతువులు, ప్రతి వస్తువూ కాంతిమయమే.. రంగురంగుల వెలుగుల్లో.. ఓ అద్భుత లోకానికి వచ్చామన్న అనుభూతి.. ఆలోచిస్తేనే ఇదో అందమైన కలగా అనిపిస్తుంది. ఈ కలను నిజం చేసేలా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఓ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. గ్లో గార్డెన్ పేరిట నిర్మిస్తున్న ఈ కాంతి వనం.. కొద్దిరోజుల్లోనే నగర ప్రజానీకానికి ఆహ్లాదాన్ని పంచనుంది.

సుందరీకరణలో భాగంగా అనేక నూతన ఆవిష్కరణలు జరిగిన నగరంలో మరో దానికి నగరపాలక సంస్థ అధికారులు రూపకల్పన చేశారు. ఆధునిక విద్యుద్దీప కాంతులతో.. మిరుమిట్లు గొలిపేలా గ్లో గార్డెన్ నిర్మాణానికి నగరపాలక సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రూ.3 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ గ్లో గార్డెన్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. సివిల్ పనులకు రూ.కోటి, అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ కోసం రూ.రెండు కోట్లు వెచ్చిస్తున్నారు. నగరంలో 50వ డివిజన్ గాంధీపురం–4లో నగరపాలక సంస్థ పార్కులో గ్లో గార్డెన్ నిర్మిస్తున్నారు. గ్లో గార్డెన్‌లో ఏర్పాటు చేస్తున్న అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పార్కులో ఏర్పాటు చేసే ప్రతి అంశానికి లైటింగ్‌తోనే అనుసంధానం చేయనున్నారు. ఫుట్‌పాత్‌ల్లో సైతం లైటింగ్ ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

**అన్ని వర్గాలను ఆకట్టుకునేలా..**

ఆహ్లాదాన్ని పంచే వన్య ప్రాణులు, కొంగలు, ఏనుగులు, జింకలు, పక్షులు, మొక్కలు, పువ్వులు, చెట్లు ఇలా మొత్తం వాటిని రంగురంగుల లైటింగ్‌తోనే ఏర్పాటు చేయనున్నారు. పార్కుకు వచ్చే సందర్శకులకు ఆహారపానీయాలు అందించేందుకు ఆరు దుకాణాలు ఏర్పాటు చేశారు. నగర ప్రజలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచేలా గ్లో గార్డెన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా గ్లో గార్డెన్ నిర్మిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ అన్నివర్గాల వారిని ఆకట్టుకునేలా నూతన కట్టడం ఉంటుందని చెబుతున్నారు.



గ్లో గార్డెన్ లోపల జరుగుతున్న నిర్మాణ పనులు

**భారం కాకూడదనే..**

నగరంలో ఇప్పటివరకూ ఏ పార్కులో చేపట్టని విధంగా ఆత్యాధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. సందర్శకులను మైమరపించేలా గార్డెన్‌కు రూపురేఖలు అద్దుతున్నారు. ఈ గార్డెన్‌కు నిర్ణీత ప్రవేశ రుసుం వసూలు చేయనున్నారు. గ్లో గార్డెన్ నిర్వహణ నగరపాలక సంస్థకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఆరు షాపుల ద్వారా, ప్రవేశ రుసుం ద్వారా వచ్చే ఆదాయాన్ని గార్డెన్ నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టడానికి వినియోగించనున్నట్టు అధికారులు తెలిపారు.



నిర్మాణంలో ఉన్న గ్లో గార్డెన్ ప్రవేశ ద్వారం

**త్వరలోనే ప్రారంభం**

గ్లో గార్డెన్‌లో సివిల్ వర్కులు దాదాపు పూర్తి కావొస్తున్నాయి. ఆధునిక లైటింగ్‌కు అవసరమైన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కొద్ది రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. పనులు పూర్తయిన వెంటనే అత్యాధునిక గ్లో గార్డెన్‌ను ప్రారంభిస్తాం.

– పాండురంగారావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ

### నేడు ఘంటసాల గానామృతం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పద్మశ్రీ ఘంటసాల 101వ జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం ఐదుకు గోదావరి గట్టుపై ఆయన విగ్రహం వద్ద ఘంటసాల గానామృతం నిర్వహిస్తున్నట్టు రాయుడు చంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సంగీత ప్రియులు, ఘంటసాల అభిమానులు పాల్గొనాలని కోరారు.

### ఆలయ పునర్నిర్మాణ మహోత్సవం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

ధవళేశ్వరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 6న ధవళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్, డీఈవోలు అబ్రహాం, కమలకుమారి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలోని రమాదేవి గార్డెన్స్‌లో శనివారం రాత్రి రాజమహేంద్రవరం డివిజన్ ఎంప్లాయిస్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫడరేషన్(న్యూఢిల్లీ), ఏపీ ప్రేయర్ టీం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాన్ఫడరేషన్ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు చింతా సురేష్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథులుగా ఎంపీ మార్గాని భరత్‌రామ్, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల విద్యా శాఖాధికారులు ఎస్.అబ్రహాం, ఎం.కమలకుమారి హాజరయ్యారు. కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దైవజనులు, హైదరాబాద్ ఎల్లడాయి చర్చ్ రెవ.పాస్టర్ ఎంఎస్ సునిత్‌వర్ధన్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. మానవుల పాప విమోచన కోసం ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. విశ్రాంత అధ్యాపకులు రాచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ వేడుకల్లో రామచంద్రపురం డీవైఈవో ఎస్ఎల్ నరసింహారావు, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి గిరిజాల సత్యసుబ్రహ్మణ్యం, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, డీసీఈబీ చైర్మన్ బీరహనుమంతరావు, బద్దె జార్జిఆంథోని, పెయ్యల రాజేష్, నక్కా రాజబాబు, పాస్టర్ టాటావిక్టర్, పాస్టర్ బయ్యోరాము, ఆర్ట్స్ కళాశాల లెక్చరర్ జె.జాకబ్, పాస్టర్ ఆనందజెకర్యా, ఏఈ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కులగణనతోనే బీసీలకు సామాజిక న్యాయం

**విశ్వ బ్రాహ్మణ వన సమారాధనలో ఎంపీ భరత్‌రామ్**



వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇతర ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: బీసీల కులగణనతో జనాభా దామాషాలో రాజ్యాంగ ఫలాలు దక్కినప్పుడే వారికి సామాజిక న్యాయం జరుగుతుందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్ సమీపంలోని చెరుకూరి వీర్రాజు తోటలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. ఎంపీ భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, టీడీపీ నేత ఆదిరెడ్డి వాసు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు కులగణన జరగడం వల్ల వారికి రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు. బీసీలకు కూడా కులగణన జరిగితే, ఆ మేరకు సంక్షేమ ఫలాలు అందించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కులగణనకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇలాగే దేశవ్యాప్తంగా బీసీ కులగణన జరగాల్సి ఉందన్నారు. బీసీలంతా ఐక్యతతో తమకు రావాల్సిన ఫలాలను సాధించుకోవాలన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు 19 లక్షల మంది ఉన్నప్పటికీ, తమ సామాజిక వర్గానికి ప్రభుత్వాలు, పార్టీలు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుల వృత్తులను కాపాడుకోవడానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని, పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు అందించాలని కోరారు. పంచ వృత్తులను కోల్పోతున్న వారికి పింఛన్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అనుపోజు వెంకటరమణ, పాలవలస వీరభద్రరావు, గొంటుముక్కల రాజు, నక్కా దేవి, పాడుగు శ్రీను, పమిడిపల్లి కోటేశ్వరరావు, చించినాడ తాతాజీ, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, ధమరసింగ్ బ్రహ్మజీ, గుంటముక్కల ప్రభాకర్, కడియం వీరబాబు, గౌరస వెంకటరమణ పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘీయుల సంక్షేమానికి కృషి

**ఎంపీ మార్గాని భరత్‌రామ్**



కార్తిక వన సమారాధనలో ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను సత్కరిస్తున్న పద్మశాలి సంఘీయులు





కాపునాడు వన సమారాధనలో పాల్గొన్న రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: పద్మశాలి సామాజిక వర్గ చేతివృత్తులతో పాటు, వారి సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక మోరంపూడి సమీపంలోని తోటలో ఆదివారం రాజమండ్రి పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలో ముఖ్యఅతిథులుగా ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ పద్మశాలి కుల వృత్తులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఆమంచి ఆంజనేయ గురుస్వామి, మోటూరి చక్రధర్, బండారు సత్తివీర్రాజు, జక్కా మాణిక్యాలరావు, నిలి నాగబాబు, గుండారపు బాబి, జక్కా తాతాజీ, బత్తుల నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు. సంఘానికి సహకరిస్తున్న ఆంజనేయ గురుస్వామి, జొన్నలగడ్డ రమేష్ తదితరులను సత్కరించారు.

**కాపులను ప్రోత్సహించాలి**

కాపులు ఏ పార్టీలో ఉన్నా, వారిని పార్టీలకతీతంగా ప్రోత్సహించాలని పలువురు కాపు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మోరంపూడి సమీపంలోని తోటలో ఆదివారం కాపునాడు ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన జరిగింది. కాపునాడు అధ్యక్షుడు గుదే రఘునరేష్ అధ్యక్షత వహించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం, రుడా మాజీ ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నాయకుడు వై.శ్రీనివాస్, బీజేపీ నాయకుడు యెనుముల రంగబాబు, కాంగ్రెస్ నాయకుడు రామినీడి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపు సంఘం నేతలు మాట్లాడుతూ సంఖ్యా బలం తక్కువగా ఉన్నప్పటికీ, ఐక్యంగా లేకపోవడంతో సామాజికంగా ఎదగలేకపోతున్నామన్నారు. అన్ని రంగాల్లో, ముఖ్యంగా విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు అల్లూరి శేషునారాయణ, పెదిరెడ్ల శంభూప్రసాద్ తదితరులు మాట్లాడారు. కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు కోటిపల్లి రామారావు, నాయకులు ముమ్మిడి వీరబాబు, అక్కిరెడ్డి ప్రసాద్, మేడబోయిన సునీల్, నేమాలి శ్రీనివాస్, ఫణి, చందు, ఇంటి దొరబాబు, బండారు రమణ, దేశిరెడ్డి రాంబాబు, విజయలక్ష్మి, నేమాలి వేణురాజశ్రీ, విన్నా వాసు, అల్లాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# భట్రాజులు పురోగతి సాధించాలి

**జిల్లా భట్రాజు సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరాజు**



బహుమతులను అందజేస్తున్న శ్రీనివాసరాజు తదితరులు

సీటీఆర్ఐ: రాజకీయంగా, ఆర్థికంగా భట్రాజులు పురోగతి సాధించాలని, అందుకు సంఘ సభ్యులు సమైక్య కృషి చేయాలని జిల్లా భట్రాజు సంఘ అధ్యక్షుడు లోలభట్టు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్‌లో జరిగిన కార్తిక వన సమారాధనకు ఆయన అధ్యక్షత వహించారు. ముందుగా సంఘ నాయకులు లోలభట్టు వరలక్ష్మి, ఇనపకృతిక శ్రీరామ ప్రసాదరాజు, సత్యనాగ వరప్రసాద్ కుమారి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ భట్రాజు పొగడ్తలు అనే పదాన్ని వినియోగించరాదని రాష్ట్ర ప్రభుత్వం జీఓ 60ను జారీ చేసిందన్నారు. అయినా కొన్ని సినిమాల్లో దీనిని ఉపయోగించి తమ మనోభావాలు దెబ్బతీసేలా చేస్తున్నారన్నారు. కమ్యూనిటీ హాలు కోసం స్థలాన్ని కేటాయించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి చల్లగాలి వెంకటరామరాజు, సంఘ నగర అధ్యక్షుడు చిట్టమనేని వెంకట్రాజు, లోలభట్టు నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఘంటసాల అవధాని డా.రహమతుల్లాకు సన్మానం



ఘంటసాల అవధాన ప్రక్రియలో సమాధానాలిస్తున్న డా.రహమతుల్లా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఘంటసాల పాటలపై అవధాన ప్రక్రియకు రూపశిల్పి డా.రహమతుల్లా ఆధ్వర్యంలో అవధాన కార్యక్రమం ఆద్యంతం రసవత్తరంగా సాగింది. స్థానిక శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర కళావేదికలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర హాజరుకాగా, పృచ్ఛకులుగా సుమారు 15 మంది అడిగిన వివిధ ప్రశ్నలకు డా.రహమతుల్లా సమాధానాలతో సమ్మోహన పరిచారు. ఏ పాటైనా, ఏ సినిమాలో.. ఎవరు.. ఏ సందర్భంలో ఘంటసాల కలిసి పాడారన్న అనేక విషయాలను తన అద్భుత జ్ఞాపకాశక్తితో సమాధానాలిచ్చారు. కార్యక్రమం అనంతరం డా.రహమతుల్లా, శ్రీపాద జిత్‌మోహన్ మిత్రాను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద్ ఈవెంట్స్ ఆర్గనైజర్ ఆనంద్, కొత్త కనకరత్నమాల, ఏపీ వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ భీమలాపురం, కవి మహమ్మద్ ఖాదర్‌ఖాన్, గుంటూరు శ్రీనివాసరావు, యూవీ సత్యనారాయణ, డా.బిక్కిన రామమనోహర్, రాయుడు, బోడపాటి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోటి దీపాల పండగ



సరస్వతి ఘాట్‌లో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి



చింతాలమ్మ ఘాట్‌లో కోటి దీపోత్సవం దృశ్యం

**ప్రారంభించిన జక్కంపూడి విజయలక్ష్మి**

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కోటి దీపాలు వెలిగించి మానవాళికి మంచి కలగాలని ఉద్దేశంతో కోటి దీపోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం, పరిసరాల్లో సుమారు 20 ఘాట్లలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్, జ్ఞాన సరస్వతి పీఠం, గౌతమి ఘాట్ ఆధ్యాత్మిక సంస్థల కాలభైరవ గురు సంస్థాన్ ధర్మశాస్త్ర ఆధ్యాత్మిక కేంద్రం, పలు సామాజిక సంస్థల సంయుక్తాధ్వర్యంలో కోటి దీపోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. తొలుత జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, దీపారాధనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ అనేక ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తున్న జీవనది గోదావరికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పరమాత్ముని, గోదారమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. సరస్వతి ఘాట్‌లో వ్యాసాశ్రమం పీఠాధిపతి అసంగానందగిరి స్వామి, ప్రభల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, తోట సుబ్బారావు, కేకే సంజీవరావు, బి.పద్మావతి, ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తుపాను హెచ్చరిక నేపథ్యంలో కొవ్వూరు నియోజకవర్గంలోని ఒక గ్రామంలో కళ్లాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు గోనెసంచుల తరలింపును పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్.

– రాజమహేంద్రవరం రూరల్



### మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నారాయణపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వనుం రమణమ్మను అరెస్టు చేశామని ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఆమె వద్ద నుంచి 180 ఎంఎల్ ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

### కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన

కడియం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్దేశించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కడియంలో ఆదివారం నిర్వహించారు. డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో ఈ యాత్రను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, తహసీల్దార్ ఎం.సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఆయుష్మాన్ భారత్, ఉచిత గ్యాస్ పంపిణీ, భూసార పరీక్షా ఫలితాల కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కురగంటి సతీష్, ఆకులు శ్రీధర్, బొరుసు సుబ్రహ్మణ్యం, కొటికలపూడి వెంకటేశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, పులిశెట్టి సత్తిబాబు, చిక్కాల శ్రీనివాస్, గుబ్బాల రామ్మోహన్, పాతంశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### కార్తిక వన భోజనాల సందడి

కడియం: కార్తిక మాసం చివరికి చేరడంతో మండలంలో ఆదివారం కార్తిక వన భోజనాల సందడి నెలకొంది. దుళ్లలో చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని విఘ్నేశ్వర కాలనీ సమీపంలో ఉన్న కోకో తోటలో వన భోజనాలు ఏర్పాటు చేశారు. సంఘీయులు కుటుంబ సమేతంగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహపంక్తి భోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంఘ పెద్దలకు ఘన సత్కారాలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన భోజనాలు స్థానిక నర్సరీలో జరిగాయి. గ్రామంలోని కమ్మ సామాజిక వర్గం కార్తిక వన భోజనాలు నిర్వహించుకున్నారు.

### బీజేపీ సంబరాలు

కడియం: అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో విజయం సాధించడంపై మండల బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. జెండా ఎగరేసి, మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ నాయకులు కురగంట సతీష్, ఆకుల శ్రీధర్, ఏనాపు ఏసు, నాగులపల్లి వీరబాబు, బోరుసు సుబ్రహ్మణ్యం, కొటికలపూడి వెంకటేశ్వరరావు, చిక్కల శ్రీను పాల్గొన్నారు.